

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## నేటి నుంచి గ్రామసభలు : తహసీల్దార్ ఆరీఫా

**మర్కుక్, జనవరి 20 (ప్రభాతవార్త):**
నేటి నుండి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మర్కుక్ మండల తహసీల్దార్ ఆరీఫా తెలిపారు. 21వ తేదీ మంగళవారం అంగడికిష్టాపూర్, ఇప్పలగూడెం, వర్గరాజ్‌పూర్, కాశిరెడ్డిపల్లి గ్రామాల్లో ఉదయం 8.30 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. గ్రామసభల సమక్షంలో రైతు భరోసా, రేషన్‌కార్డు దరఖాస్తుదారులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామ ప్రజలు గ్రామసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

22వ తేదీన బుధవారం చేబర్తి, దామరకుంట, కర్కపట్ల, గణేష్‌పల్లి, 23వ తేదీ గురువారం పాములపర్తి, మర్కుక్, నర్సన్నపేట, శివారువెంకటాపూర్, 24వ తేదీ శుక్రవారం పాతూరు, భవానందపూర్, ఎర్రవల్లి, గంగాపూర్-యూసుఫ్‌ఖాన్‌పల్లి గ్రామాల్లో గ్రామసభలు ఉంటాయన్నారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

**ములుగు, జనవరి 20 (ప్రభాతవార్త):**
రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతిచెందిన సంఘటన ములుగు మండలం సింగాయపల్లి గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని క్షీరసాగర్ గ్రామానికి చెందిన గంగమ్మ అనిల్(18) అనే విద్యార్థి సోమవారం ఉదయం 10 గంటలకు ఎపి12 సి5444 నెంబర్ గల స్లెండర్ వాహనంపై వంటిమామిడికి వెళ్తుండగా సింగాయపల్లి గ్రామ శివారులోకి చేరుకోగానే ఎదురుగా వచ్చిన టిఎస్35 టిఏ0361 నెంబర్ గల అశోక్ లేలాండ్ వాహనం ఢీకొంది. దీంతో అనిల్ తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ములుగు పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



టేక్మాల్ సర్వే అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

## సర్వేకు ప్రజలు సహకరించాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**టేక్మాల్, జనవరి 20 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న నాలుగు పథకాలలో లబ్దిదారుల ఎంపికకు నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి సర్వేలకు ప్రజలు సహకరించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. సోమవారం టేక్మాల్‌లో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ సర్వేల నిర్వహణ ద్వారా పథకాల అమలుకు లబ్ది దారును ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు సహకరిస్తేనే సర్వే వేగవంతంగా పూర్తవు తుందని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన ఈ నాలుగు పథకాలు అర్హులైన ప్రతి ఇంటికి అందించ డమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని తెలిపారు. సర్వే వివరాలను సిబ్బంది పకడ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు. రైతు భరోసాకు సాగులో చేసుకునే భూములను నమోదు చేసుకు నేందుకు రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వేలో పాల్గొంటున్నారని పేర్కొ న్నారు. వ్యవసాయానికి అనువుగా లేని భూముల వివరాలు నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్ల కు తావివ్వకుండా వివరాలను నమోదు చేయాలని సర్వేసిబ్బందికి సూచించారు. ఇందులో తహసీల్దార్ తులసిరాం, ఎంపిడిఓ విఠల్, మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ కిశోర్, ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ మహేష్, ఎఈఓ మంజుల, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

## నేటి నుంచి మున్సిపల్‌లో వార్డు సభలు

**గజ్వేల్, జనవరి 20 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఈనెల 21వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. 1వ వార్డులో కోటమైసమ్మ గుడి దగ్గర చాకలి ఐలమ్మ భవనంలో, 2వ వార్డు క్యాసారం వార్డు ఆఫీస్ వద్ద, 3వ వార్డు ప్రజ్ఞాపూర్ పోచమ్మ గుడి వద్ద, 4వ వార్డు బాలుర ఉన్నత పాఠశాల ప్రజ్ఞాపూర్‌లో, 5వ వార్డు ముట్రాజ్‌పల్లి వార్డు ఆఫీస్ వద్ద వార్డు సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కావున పట్టణ ప్రజలు కొత్త రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు కొరకు దరఖాస్తు చేసుకొనుటకు అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## నేటి నుంచి గ్రామ సభలు : ఎంపిడివో

**మెదక్ రూరల్, జనవరి 20 ప్రభాతవార్త :** ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలనే ఉద్దేశంతో ఈ నెల 21 తేదీ నుంచి 23 తేదీ వరకు మెదక్ మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించడం జరుగు తుందని ఎంపీడీఓ రఘు తెలిపారు. గ్రామసభల ద్వారా లబ్దిదారుల ఎంపిక శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఈ నెల 21 తేదీ మంగళవారం మండలంలోని జానకంపల్లి, మల్కాపూర్ తండా, మద్దంపూర్, సంగాయి గూడ తాండ, శివాయిపల్లి గ్రామాలలో 22 తేదీ బుధవారం బాల్ నగర్, పాతూర్, ర్యాల మడుగు, రాయినపల్లి, తిమ్మానగర్ గ్రామాలలో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. 23 తేదీ గురువారం చిట్యాల, గుట్టకింది పల్లి, కాజిపల్లి, మక్త భూపతిపూర్, మాచవరం, మంబోజిపల్లి, పేరూర్, రాజుపల్లి, వెంకటాపూర్ గ్రామాలలో గ్రామ సభలు నిర్వహిస్తామని, అర్హులైన వారి నుంచి ప్రభుత్వం పథకాలకై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుంది అని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 20, ప్రభాతవార్త :** జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి 56 మంది తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీలు అధికారులు స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం అదనపుకలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్, అదనపు కలెక్టర్(రెవెన్యూ) మాధురితో కలిసి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు జిల్లాలోని ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జనవరి 26న అమలుచేయనున్న నాలుగు సంక్షేమ పథకాల (రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు) పై ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభల నిర్వహణపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కీలకమైన నాలుగు సంక్షేమ పథకాల అమలును జనవరి 26న ప్రారంభించనున్న నేపథ్యంలో ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలను షెడ్యూల్ వారీగా ఖచ్చితంగా సమయపాలన పాటిస్తూ నిర్వహించాలని, ఎక్కడ కూడా నిర్లక్ష్యనికి తావు లేకుండా అధికారులందరూ అత్యంత జాగ్రత్తగా ఈ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని పేర్కొన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలలో లబ్దిదారుల జాబితాను గ్రామ సభల్లో చదివి వినిపించాలని, అభ్యంతరాలుంటే దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఎలాంటి అపోహలు తలెత్తకుండా ప్రజలకు స్పష్టంగా వివరించాలని, ఈ మొత్తం సంక్షేమపథకాల రోజువారీ ప్రక్రియను మండల ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గ్రామ సభల తీర్మానప్రతులను సురక్షితంగా, జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

# 26 నుంచి నాలుగు సంక్షేమ పథకాలు

### ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్

**రాయికోడ్, జనవరి 20, ప్రభాతవార్త:**
ఎన్నికల సందర్భంగా చేసిన 6 గ్యారంటీల్లో భాగంగా ఈ నెల జనవరి 26 నుంచి నాలుగు గ్యారంటీల సంక్షేమ పథకాలను అమలు చేయను న్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ పేర్కొన్నారు. సోమవారం రాయికోడ్ లోని భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి మంత్రి దామోదర్ ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతనంగా నియమితులైన ఆలయకమిటీ చైర్మన్ కులకర్ణి ప్రభాకర్, వైస్‌చైర్మన్ గొవ్వ భీమన్న, సభ్యులుగా పి బసవంత రావు, ఉప్పరి విఠల్, బేకర్ కృష్ణవేణి, బి నర్సయ్య, జొన్నాడ దత్తరెడ్డిలు మంత్రి దామోదర్ సమక్షంలో ప్రమాణ స్వీకారంచేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ మాట్లాడుతూ గత 10 సంవత్సరాల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డును సైతం అందివ్వలేదని హేళన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికి రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ంరైతు భరోసా కింద ఎకరానికి 12వేల రూపాయలను ఈ నెల 26వ తారఖీ నుంచి ప్రారంభిస్తోందన్నారు. ఉపాధి హామి కూలీలకు ఇందిరమ్మ, ఆత్మీయ భరోసా ఇవ్వనున్నట్లు వివరించారు. ఇల్లులేని ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామన్నారు. రాయికోడ్, కప్పాడ్ చౌరస్తారోడ్డును 20 రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రాయికోడ్‌లో ప్రభుత్వ ఐటిఐ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. రెసిడెన్షియల్ పాఠశాల మోడల్ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌లుగా, ఎంపిటిసి సభ్యులుగా, జడ్పీటిసి సభ్యులుగా కాంగ్రెస్ మద్దతు దారులు, కాంగ్రెస్ అభ్యర్థులువిజయం సాధించేలా ప్రతి కార్యకర్త సైనికుడిలా కృషి చేయాలని మంత్రి సూచించారు.

కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మండల ప్రత్యేక అధికారి జగదీష్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఇఓ శివ రుద్రయ్య, ఆలయ కమిటి చైర్మన్ కులకర్ణి ప్రభాకర్, మండల అధ్య క్షులు బాలాజీ, నరసింహులు, కేదార్‌నాథ్‌పాటిల్ మార్కెట్ కమిటి చైర్మన్ సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి దామోదర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

# రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

**-గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ**
**-మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 20 ప్రభాతవార్త:**
రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, గ్రామసభల్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, పౌర సరఫరాల అధికారి సురేష్‌రెడ్డితో కలిసి కలెక్టర్ రాహుల్ రాజ్ ఆర్డీవోలు, జిల్లా, మండల స్థాయి ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహశీల్దార్‌లతో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన క్షేత్రస్థాయి సర్వే పరిశీలన ప్రక్రియ, గ్రామ/వార్డు సభల నిర్వహణపై టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి సంబంధిత అధికారులకు సూచనలు చేసి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈనెల 26న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి కీలకమైన నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేయడం కోసం నిర్వహిస్తోన్న క్షేత్రస్థాయి సర్వే పరిశీలనలో అలసత్వం వహించకుండా వేగవంతం చేసి రేపటిలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు జారీ చేయడం జరుగుతుందని, రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్లు నిరంతర ప్రక్రియ అని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదనే విషయాన్ని విస్తృతంగా ప్రచారాన్ని చేసి ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను రిగణనలోకి తీసుకొని పరిశీలించడం జరుగుతుందని వివరించారు. అదేవిధంగా గ్రామ సభలు/వార్డు సభల ద్వారా, ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా, మీసేవా కేంద్రాల ద్వారా, ఎంపీడీవో కార్యాలయంలోనూ కొత్త రేషన్‌కార్డులకు (లేదా) కొత్త సభ్యుల చేర్పులకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని వెల్లడించారు. రైతు భరోసా పథకం కింద సాగుకు యోగ్యం కాని భూములకు పంట పెట్టుబడి సాయాన్ని నిలువరించేలా స్థిరాస్తి వెంచర్లుగా మారిన భూములు, కొండలు, గుట్టలు, రాళ్లు, రప్పలు ఉన్న భూములు, వేడుకల మందిరాలు, కోళ్ళ ఫారాలు, పరిశ్రమలు, గనులు, ఇటుక బట్టీ భూములను ప్రత్యేక శ్రద్ధతో ఆచితూచి గుర్తించాలని, ఈ గుర్తింపు సర్వే తీరులో ఎంత మాత్రం అజాగ్రత్త ప్రదర్శించకుండా సమర్థవంతంగా పనిచేయాలని, ఒకవేళ అలా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా కనీసం ఇరవై రోజుల పాటు కూలి పని చేసిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తిస్తుందని, ప్రతి కుటుంబంలో మహిళల బ్యాంకు ఖాతాలకే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొత్తాన్ని బదిలీ చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామ/వార్డుసభల నిర్వహణకు బ్యానర్‌లను సక్రమంగా ఏర్పాటు చేయాలని, అందుకు అనుగుణంగా విస్తృత ప్రచారకార్యక్రమాలు చేపట్టాలని, ప్రజలకు కనీస మౌలిక వసతులను కల్పించాలని, గ్రామ సభలకు హాజరయ్యే అధికారులు, ప్రజల సంతకాలను తీసుకోవాలని, లబ్ధిదారుల ముసాయిదా జాబితాను పారదర్శకంగా రూపొందించాలని, అందుకు తగ్గట్లుగా ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, ముందస్తుగా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో అన్ని మండలాల తహశీల్దార్లు, మునిసిపల్ కమిషనర్‌లు, అన్ని మండలాల ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలను ప్రభుత్వం అమలు చేయాలి

**సంగారెడ్డి మున్సిపాలిటీ జనవరి 20, ప్రభాతవార్త :** కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, అక్రమ మద్యం బెల్టుషాపులను అరికట్టాలని, కల్లు దుకాణాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు ఆపాలని కోరుతూ సోమవారం కల్లుగీతకార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, డిమాండ్ల తో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రంను ఇచ్చారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.ఆశన్నగౌడ్ కార్యదర్శులు ఎస్.రమేష్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామాలలో అక్రమంగా మద్యం బెల్ట్ షాపులు విచ్చలవిడిగా అధిక ధరకు అమ్ముతున్న పోలీసు అధికారులు గానీ జిల్లా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడంలేదని, కల్లుగీత వృత్తికి రక్షణ కల్పించి గీత కార్మికుల ఉపాధిని కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు రామా గౌడ్, రవి గౌడ్ సంగారెడ్డి మండలాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ఉపాధ్యక్షులు కృష్ణ గౌడ్, నాయకులు పవన్ గౌడ్ నారాయణ గౌడ్, మల్లేశం గౌడ్, లచ్చగౌడ్, సుదర్శన్ గౌడ్, శేఖర్ గౌడ్ ప్రభువు గౌడ్ మల్లేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కు వినతిపత్రం అందజేస్తున్న కల్లు గీత కార్మిక సంఘం నాయకులు

# బాలిక సాధికారతలో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి

**-బేటీ బచావో.. బేటి పడావో కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలి.. మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 20 ప్రభాతవార్త:**
బాలిక సాధికారత దిశగా జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని, బేటీ బచావో.. బేటి పడావో కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని, పది సంవత్సరాలు పూర్తిచేసుకున్న బేటి బచావో.. బేటి పడావో పథకం ఉత్సవాల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేయాలి మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారిక కేంద్రం, మిషన్ శక్తి ఆధ్వర్యంలో బేటి బచావో.. బేటి పడావో కార్యక్రమంపై సమన్వయ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, జిల్లా మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి హైమావతి, అదనపు ఎస్పీ మహేందర్ ఇతర శాఖల అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖలతో సమన్వయం ఏర్పాటు చేసుకుని ఆడపిల్లల ఎదుగుదలకు సమాజంలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షల చట్టంపై వైద్య సిబ్బంది, ఆశా వర్కర్‌లతో అవగాహన కల్పించాలని, గ్రామాల్లో తరచూ ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలకు చట్టపరమైన సంరక్షణ కల్పించి కృషి చేయాన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జరిమానాతో పాటు జైలు శిక్షణపై ప్రజలకు వివరిస్తూ బాలిక సాధికారత దిశగా జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని చెప్పారు. బాలికల మెరుగైన రక్షణలో వారి విద్యను ప్రోత్సహించడంలో లింగ వివక్షతతోకూడిన సెక్స్ ఎంపిక పద్ధతులను నిరోధించడంలో గణనీయమైన కృషి చేసిందని చెప్పారు.

బేటి బచావో.. బేటి పడావో పథకం 10 సంవత్సరాల పూర్తిచేసుకున్న సంద ర్భంగా ఉత్సవాలు నిర్వహించడానికి కార్యచరణ ముమ్మరం చేయాలన్నారు. పాఠశాలల్లోని బాలిక లకు ఆత్మస్థైర్యాన్ని కలిగించేలా చైతన్య కార్యక్ర మాలు నిర్వహించాలని కోరారు. భేటీ బచావో.. బేటి పడావో కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీవో శ్రీనివాస రావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్, సీడీపీవోలు, సఖి మహిళా సాధికారత బృందాలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్



బుదేరాలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి దామోదర్

## అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి దామోదర్

**మునిపల్లి, జనవరి 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బుదేరాలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఉమెన్ డిగ్రీ అండ్ పిజి కళాశాల, జూనియర్ కళాశాలలను, తాటిపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను సోమవారం పరిశీలించారు. విద్యాలయంలో విద్యను అందుకుంటున్న విద్యార్థులతో, పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులతో మంత్రి ప్రత్యేకంగా పలు విషయాలపై చర్చించారు. ఏజీబీవి పాఠశాలలో వంట గదిని పరిశీలించారు. విద్యార్థులకు విశాలమైన డైనింగ్ హాల్, డిజిటల్ క్లాస్ రూమ్, ఆర్ఓ ప్లాంట్, అదనపు తగరతి గదులు, పేరెంట్స్ వెయిటింగ్ హాల్‌లను సిఎస్ఆర్ నిధులతో నిర్మిస్తామని మంత్రి దామోదర్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో బాలికల విద్య ప్రోత్సాహకానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు నాయకులు పాల్గొన్నారు.

## మల్లన్నసాగర్ నిర్వాసితులకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'ను అమలు చేయాలి

### -డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న డిబిఎఫ్ నాయకులు

**గజ్వేల్‌టౌన్, జనవరి 20(ప్రభాతవార్త):** మల్లన్నసాగర్ భూ నిర్వాసితులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. మల్లన్నసాగర్ భూ నిర్వాసితులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఉపాధిహామీ పథకం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డిబిఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు నాలుగు సంవత్సరాలుగా ఉపాధి హామీ పనులు కల్పించకుండా చట్టాన్ని ఉల్లంఘించారన్నారు. ఉపాధి హామీ పనులు కల్పించకపోవడంవల్ల ప్రస్తుతం ప్రభుత్వం కూలీలకు అమలు చేస్తున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులు కాకుండా పోయారన్నారు. ఇటీవల మున్సిపాలిటీలలో కలిపిన గ్రామాలకు ప్రత్యేక పరిస్థితులలో అమలు చేస్తున్నట్లు మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మ సాగర్ తదితర ప్రాజెక్టుల భూనిర్వాసితులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలన్నారు. ప్రభుత్వమే భూమిని స్వాధీనం చేసుకున్నందున నిర్వాసితులు భూమిలేని కూలీలుగా మారారన్నారు. భూసేకరణ చట్టం 2013 ప్రకారం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని వేములఘాట్ పరిధిలోని తుర్కబంజేరుపల్లికి చెందిన 44 మంది వడ్డెర కులస్తులకు ప్లాట్‌లను రిజిస్ట్రేషన్ చేసి మూడు సంవత్సరాలు దాటినా నేటికి పొజిషన్ చూపించలేదన్నారు. అలాగే 1600 మంది మల్లన్నసాగర్ నిర్వాసితులకు ప్లాట్‌లను చూపించలేదన్నారు. 600 మందికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయలేదని, 800 మంది ఒంటరి మహిళలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయకుండా గత, ప్రస్తుత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. 400 ఎకరాలకు నష్టపరిహారం నేటికీ అందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, హైకోర్టు న్యాయవాది దివాకర్, నిర్వాసితులు నర్సింలు, కనకయ్య, రుక్కయ్య, నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**గజ్వేల్, జనవరి 20 (ప్రభాతవార్త):** కొడకండ్ల సబ్‌స్టేషన్‌లో ఈనెల 21వ తేదీన 33 కెవి లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజ్ఞాపూర్ సెక్షన్ విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కొడకండ్ల, రిమ్మనగూడ, దాతర్‌పల్లి, దాచారం, బూర్గుపల్లి, రాయవరం గ్రామాలకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

## రాజ్యాంగానికి తూట్లు పొడిచిందే కాంగ్రెస్ పార్టీ

### ఎంపి రఘునందన్ రావు

**సంగారెడ్డి బ్యూరో జనవరి 20 ప్రభాతవార్త :**
బిజెపి జిల్లా కార్యాలయంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సోమవారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ప్రెస్‌మీట్‌లో మెదక్ కరీంనగర్ నిజాంబాద్ అదిలాబాద్ బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సి.అంజిరెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి సమావేశంలో పాల్గొన్నారు ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను అవమానించడం జరిగిందని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను ఎన్నికల్లో ఓడించారానీ, ప్రధాని మోడీ ప్రభుత్వం బి.ఆర్.అంబేద్కర్‌కు భారతరత్న ఇచ్చిందని గుర్తుచేశారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచిందే కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు. రాహుల్‌గాంధీ తెల్లటీషర్టు వేసుకొని నిరసన వ్యక్తం చేయడం హాస్యాస్పదమని, పసుపు బోర్డు తమ పోరాటం వల్లే వచ్చిందని ఎమ్మెల్సీ కవిత చేస్తున్న ప్రచారంపై స్పందిస్తూ మతిస్థిమితం గురించి మంచి వైద్యున్ని చూపించుకోవాలని సూచించారు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు రైతుల గురించి పట్టించుకోని కేటీఆర్ ఇప్పుడు రైతుల గురించి మాట్లాడడం హాస్యాస్పదం అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని అంజిరెడ్డి గారిని ప్రకటించడం జరిగిందని తెలిపారు. అనంతరం జిల్లా కార్యాలయంలో శాంత కుమార్ జిల్లా ఎన్నికల అధికారి కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ఆరు మోసాలు, భారత్ సంవిధాన్ గౌరవ్‌దివస్ కార్యక్రమాన్ని వారం రోజులు నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మందుల నాగరాజ్, కసినివాసు ఆదిలి రవీందర్, ద్వారకా రవి, కొవ్వూరి సంగమేష్, జగన్ ,డాక్టర్ రాజు గౌడ్, ప్రతాప్ రెడ్డి, దోమల విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపి రఘునందన్‌రావు

## హెచ్ఎంపై దాడికి ఉపాధ్యాయుల నిరసన




నల్లబ్యాడ్జీల ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

**నారాయణఖేడ్ టౌన్, జనవరి 20, ప్రభాతవార్త:**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంబాలపల్లి రాములుపై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. సోమవారం నారాయణఖేడ్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు సంఘాలు పిలుపు మేరకు పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి



రోడ్డు నిర్మాణానికి శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్ రూరల్, జనవరి 20, ప్రభాతవార్త:**
నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి అన్నారు. మండల పరిధి మూసాపేట గ్రామం నుండి పీడబ్ల్యూడీ రోడ్డు నుండి తౌర్యా తండా వెళ్లే రోడ్డుకు సోమవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి శంఖుస్థాపన చేశారు. 1.5లక్షల నిధులు మంజూరు కావడంతో ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాగులపల్లి మాజీసర్పంచ్ సేనాధిపతి, నాయకులు జీవన్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, వార్డుసభ్యులు ఉపసర్పంచ్ శ్రీశైలం, జలీల్, నవీన్, గడ్డం మహేందర్, ఇస్లావత్ విఠల్, చంద్రు, పర్శారాము, శంకర్, ధన్‌సింగ్, నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జపాన్ సకురా సైన్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంకు ఎస్‌విఈఎస్ విద్యార్థుల ఎంపిక



జపాన్ సకురా సైన్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంకు ఎస్‌విఈఎస్ విద్యార్థులు

**నర్సాపూర్, జనవరి 20, ప్రభాతవార్త:**
శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ (ఎస్‌విఈఎస్)కు చెందిన మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు, ఫ్యాకల్టీ మెంబర్లు జపాన్ అండ్ సైన్స్ టెక్నాలజీ ఏజెన్సీ (జెఎస్‌టి) జపాన్ స్పాన్సర్‌చేసిన ప్రిస్టీజియస్ సకురా సైన్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో పాల్గొనేందుకు ఎంపికయ్యారని ఎస్‌విఈఎస్ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమమోటో యూనివర్సిటీ జపాన్ ప్రొఫెసర్ డాక్టర్ శూచి టోరీ మార్గదర్శకత్వంలో 7మంది విద్యార్థులు, ఒక ఫ్యాకల్టీ మెంబర్ కలిపిన బృందం ఈనెల 19నుండి 25వరకు పునరుత్పాదక ఇంధన వనరులు, వేస్ట్‌టుఎనర్జీ మార్పిడి సాంకేతికతలపై అత్యాధునిక పరిశోధనకు అనుభవాన్ని పొందనుందని ఆయన వెల్లడించారు. ఎస్‌విఈఎస్ ప్రఖ్యాత జపానీస్ యూనివర్సిటీలతో రీసెర్చ్ సహకారాలను బలోపేతం చేస్తూ విద్యార్థులు, ఫ్యాకల్టీ మెంబర్లకు అభివృద్ధిచెందిన పరిశోధన, ప్రావీణ్య అవకాశాలను అందిస్తుందని తెలిపారు. ఈసందర్భంగా ఎస్‌విఈఎస్ చైర్మన్ విష్ణురాజు ఈప్రోగ్రాంపై తన ఉత్సాహాన్ని పంచుకుంటూ ప్రోగ్రాంలో మాకోర్ ఇంజనీరింగ్ విద్యార్థులకు అంతర్జాతీయ పరిశోధన అవకాశాలు అన్వేషించడానికి వారి సాంకేతికనైపుణ్యాలను మెరుగుపరచడానికి, అగ్రశేణి కోర్ కంపెనీలలో విజయవంతమైన కెరియర్ కోసం సిద్ధమవ్వడానికి ఒక అద్భుతమైన వేదికను అందిస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్‌విఈఎస్ సెక్రటరీ డాక్టర్ ఆదిత్య విస్సం, డీన్ రీసెర్చ్ డాక్టర్ రాజు ఎడ్ల, కళాశాల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ దూబే, మేనేజర్ బాపిరాజులు ఎంపికైన వారిని అభినందించారు.

## నర్సాపూర్‌లో సిఎం కప్ పోటీలు

**నర్సాపూర్, జనవరి 20, ప్రభాతవార్త:**
నియోజకవర్గకేంద్రమైన నర్సాపూర్‌పట్టణంలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడిమెదక్ జిల్లాస్థాయి తెలంగాణ సిఎం కప్ 2025 గ్రేస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఈనెల 26నుండి ప్రారంభమవుతుందని నర్సాపూర్‌బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్ తెలిపారు. ఈక్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లకు డ్రా ఈనెల 23న జరుగుతుందని తెలిపారు. గ్రేస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన ప్రథమజట్టుకు నగదుబహుమతిగా 1,00,909రూపాయలు, ద్వితీయజట్టుకు నగదుబహుమతిగా 50,909 రూపాయల అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈక్రికెట్ టోర్నమెంట్ పూర్తివివరాల కోసం 9492911704 ఫోన్‌నెంబర్‌ను సంప్రతించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్ తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే ఆత్మీయ పలకరింపు



బిఆర్ఎస్ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే ఆత్మీయ పలకరింపు దృశ్యం

**సిర్గాపూర్, జనవరి 20, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని పోచపూర్‌లో సోమవారం బిఆర్ఎస్ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆత్మీయంగా పలుకరించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్నమోసాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా కృషిచేస్తూ బిఆర్ఎస్ మద్దతుదారులను, బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు శంకర్, నాయకులు మారుతి, నారాయణ, సాయిలు, అంజయ్య, లక్ష్మయ్య, చిన్న, బసవరాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయులపై దాడికి నల్ల బ్యాడ్జీలతో నిరసన

**నర్సాపూర్, జనవరి 20, ప్రభాతవార్త:**
రంగారెడ్డిజిల్లా మహేశ్వరంమండలం తుక్కుగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములుపై జరిగిన దాడికి నిరసనగా రాష్ట్రంలో అన్ని ఉపాధ్యాయసంఘాల పిలుపుమేరకు సోమవారం నర్సాపూర్ పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నర్సాపూర్, మండలంలోని ఉపాధ్యాయులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా పిఆర్ టియుటిఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి సామ్యానాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజంలో మార్గదర్శకులుగా ఉంటారని, విద్యార్థులు విద్యాభివృద్ధిలో కృషిచేస్తూంటారన్నారు. సమాజంలోని రుగ్మతలను నిర్మూలించుటలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని అన్నారు. కాగా కొందరు ఉపాధ్యాయులను మానసికంగా వేధించటం, శారీరకంగా హింసించడం సరైందికాదన్నారు. హెచ్ఎం రాములుపై జరిగిన దాడిని సంఘంపక్షాన పూర్తిగా ఖండిస్తున్నామని అన్నారు. సమష్టిగా ఉపాధ్యాయసంఘాల పిలుపు మేరకు నేడు ప్రతిపాఠశాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తంచేశారు. ఈ మేరకు ప్రభుత్వం బాధ్యులను గుర్తించి తగుచర్యలు తీసుకొని ఉపాధ్యాయులకు మనోధైర్యాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు విట్టల్, పిఆర్‌టియుటిఎస్ రాష్ట్రబాధ్యులు వీరేశం, శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, బాలకిషన్, కీరు రాథోడ్, జిల్లా ప్రతినిధులు సుచరిత, పుష్పలత, లక్ష్మి, నాగవేణి, సునీత, శంషాద్‌బేగం, హేమలత, ఇందిరా ఉన్నతపాఠశాల నర్సాపూర్ ఉపాధ్యాయ బృందం పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.




పాఠశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

## బోర్‌తో తాగునీటి సమస్యకు పరిష్కారం



బోరు మోటర్ వేయడాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

**నర్సాపూర్, జనవరి 20, ప్రభాతవార్త:**
తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్‌వేయడంతో ఈవార్డులో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో నీటి ఎద్దడి నివారణ కోసం బోరు మోటర్ వేయించడం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవార్డులో బోర్ వేయించడం జరిగిందని దీంతో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని ఆమె అన్నారు. రానున్న వేసవి కాలం దృష్ట్యా ఈబోరువేయడంతో వార్డుప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఈకార్యక్రమంలో నర్సాపూర్ పట్టణ బల్దియా ఉపాధ్యక్షులు నయీం ఉద్దీన్, 14వవార్డు కౌన్సిలర్ సరిత ఆంజనేయులు, మాజీ జడ్పీ సభ్యులు బాబ్యానాయక్, కౌన్సిలర్లు రాంచందర్, నాయకులు సత్యంగౌడ్, పంబల బిక్షపతి, షేక్‌హుస్సేన్, సూరారం నర్సింలు, జగుపతి, తదితరులు పాల్గొన్నారు.

## అటవీశాఖ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం



అటవీశాఖ సిబ్బంది శిక్షణకార్యక్రమంలో డిసిఎఫ్ ప్రకాష్, అటవీశాఖ సిబ్బంది తదితరులు

**నర్సాపూర్, జనవరి 20, ప్రభాతవార్త:**
నర్సాపూర్‌పట్టణంలోని రైతువేదికలో సోమవారం నేషనల్ ఫారెస్ట్ ఇన్వెంటరీ ప్రోగ్రాం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అటవీశాఖసిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈశిక్షణాకార్యక్రమానికి డిసిఎఫ్ ప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరై అటవీసిబ్బందికి శిక్షణను ఇచ్చారు. ఈశిక్షణలో అటవీశాఖసిబ్బందికి వర్కింగ్ ప్లాన్, ప్రిపరేషన్‌పై అవగాహన కల్పించారు. అనంతరం నర్సాపూర్ అటవీ ప్రాంతంలోగల అర్బన్ పార్కును సందర్శించారు. అర్బన్‌పార్క్‌లో ప్లాంటింగ్ చేయడం, తదితర ఫీల్డ్‌పనులపై శిక్షణను ఇచ్చారు. ఈకార్యక్రమంలో డిఎఫ్ఓ జోజి, నర్సాపూర్ ఎఫ్ఆర్ఓ అరవింద్, ఇతర ఎఫ్ఆర్ఓలు, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బిఓలు అటవీశాఖసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కబేళాలకు తరలిస్తున్న గోవుల పట్టివేత



కబేళాలకు తరలిస్తున్న గోవులు

**ములుగు, జనవరి 20 (ప్రభాతవార్త):**
అక్రమంగా కబేళాలకు తరలిస్తున్న 34గోవులను ములుగు భజరంగ్‌దళ్ సభ్యులు పట్టుకున్నారు. సోమవారం తెల్లవారుజామున ములుగు రాజీవ్ రహదారిపై సిద్ధిపేటవైపు నుండి హైద్రాబాద్‌లోని కబేళాలకు గోవులను తరలిస్తుండగా నమ్మదగిన సమాచారంతో భజరంగ్‌దళ్ సభ్యులు పట్టుకొని ములుగు పోలీసులకు అప్పగించారు. వాటికి వైద్యపరీక్షల అనంతరం గోవులను గోశాలకు తరలించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీ చట్టాల అమలుతో గోవధనిర్మూలనకు కృషిచేస్తుండగా అక్రమార్కులుమాత్రం పట్టించుకోకుండా యథేచ్ఛగా గోవధను ఆపడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కావున ప్రభుత్వం ఇలాంటి అక్రమార్కులపై కఠినచర్యలు తీసుకొని ఇలాంటి దుశ్చర్యలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. గోవులను తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ములుగు పోలీసులు తెలిపారు.

## ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు ఇవ్వాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, జనవరి 20, ప్రభాతవార్త:**
ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు పెట్టుకున్న ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు ఇవ్వాలని బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచాక స్థానికసంస్థలు, మండలపరిషత్, జిల్లాపరిషత్ ఎన్నికలు ఉన్న సందర్భంగా ప్రజలకు ఇచ్చినహామీలను నెరవేర్చడంలో విఫలమై అధికారంలో చులకన అయిపోతాం, అవహేళన అయిపోతామని రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌ప్రభుత్వం జనవరి 26 తేదీతో ప్రజలను మోసం చేయడానికి సిద్ధమైందని తెలిపారు. స్థానికసంస్థల ఎన్నికల కోసం మరోసారి ప్రజలను మోసంచేయడానికి ఊరికి 20రేషన్‌కార్డుల లిస్టుతో చేతులు దులుపుకుంటామంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రజాపాలనలో దరఖాస్తు పెట్టుకున్న అందరికి రేషన్‌కార్డు ఇచ్చేవరకు పోరాడుతామని తెలిపారు. దీన్నిబట్టి చూస్తే ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కూడా ఇలాగే ఉంటుందా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజాపాలనలో 12లక్షలమంది రేషన్ కార్డు కోసం దరఖాస్తు పెట్టుకుంటే కేవలం లక్షమందికి మాత్రమే కార్డులను కేటాయించి చేతులు దులుపుకునే పనిలో రేవంత్‌రెడ్డి ఉన్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా రేషన్‌కార్డుల కోసం ప్రజలు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. పేదలకు రేషన్‌కార్డులను దూరంచేసే కుట్రలను కాంగ్రెస్‌పార్టీ చేస్తుందని, దీనిని ఏమాత్రం సహించబోమని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామసభలలో రేషన్‌కార్డుల కోసం ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, గజ్వేల్ ఆత్మకమిటీ మాజీచైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, మర్కుక్ మాజీ ఎంపిపి పాండుగౌడ్, గజ్వేల్ కో-ఆప్షన్ సభ్యుడు ఉమర్ పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



మంత్రి దామోదర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**చౌటకూరు, జనవరి 20, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని చక్రియాల గ్రామానికిచెందిన కాంగ్రెస్ నాయకులు సోమవారం రాష్ట్ర ఆరోగ్యశాఖమంత్రి సి.దామోదర్‌ను మర్యాదపూర్వకంగా జిల్లాకేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో కలుసుకున్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్‌నాయకులు మంత్రిని శాలువాతోసత్కరించి పూలబొకేలు అందచేశారు. చక్రియాల గ్రామాభివృద్దిని నిధులు మంజూరుచేయాలని నాయకులు మంత్రికి వినతిచేశారు. గ్రామంలోని శ్రీలక్ష్మీ అనంతపద్మనాభస్వామి ఆలయకమిటిని ఏర్పాటుచేయడం పట్ల నాయకులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి దామోదర్‌ను కలిసి వారిలో ఆలయకమిటీ చైర్మన్ భానూరి లక్ష్మయ్య, డైరెక్టర్ సత్యనారాయణ, అంజిరెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు చిన్నరోళ్లపాటి రాజశేఖర్, నీరుడి సత్యనారాయణ ముదిరాజ్ ఉన్నారు.

## నాణ్యమైన సిఎంఆర్ బియ్యాన్ని అందజేయాలి
### జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:**
నాణ్యమైన సిఎంఆర్ రైసును అందజేయాలని జిల్లా అధనపు కలెక్టర్ లింగ్యానాయక్ రైస్ మిల్లర్లకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని పౌరసరఫరాల కార్యాలయంలో ధాన్యం డెలివరీ అంశంపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మిల్లర్లకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు బియ్యాని అందజేయాలన్నారు. ఈ నెల 25 లోపు 2221 టన్నుల సన్న బియ్యముతో పాటుగా 2023-24 సంవత్సరం రబీకి సంబంధించిన 5499.279 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అందజేయాలని మిల్లర్లకు సూచించారు. ఈసమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్‌బాబు, జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, ఏసిఎస్ఓ ఆర్తి నాయక్, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బాలేశ్వర్ గుప్తా, కార్యదర్శి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిపలకు గ్రామసంఘాల అధ్యక్షుల శిక్షణ కార్యక్రమం



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జాన్ కెన్నెడీ తదితరులు

**నర్సాపూర్, జనవరి 20, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలోని నర్సాపూర్ మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం గ్రామ సంఘాల అధ్యక్షురాలు, సీఏ లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జాన్ కెన్నెడి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సంఘాల అధ్యక్షులు, సిఏలు పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. ఈ మేరకు ఈ సంఘంలోని విధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ మేరకు ఆయన సంస్థాగత శాసనాత్మక బాధ్యతలు, ఉపవిధులు, ఎన్నిక, కాలపరిమితి, నిబంధనావళి వంటి తదితర అంశాలపై జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సంస్థాగత విభాగం జాన్ కెన్నెడీ క్లుప్తంగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జాన్ కెన్నెడీ తో పాటు, ఏపీఎం గౌరీ శంకర్, సీసీలు దేవి సింగ్, ఆంజనేయులు, రవీందర్, ప్రవీణ, భాగ్య, సమత, అకౌంటెంట్ మల్లేశం, ఆపరేటర్ సురేష్ సమాఖ్య అధ్యక్షురాలు మమత అన్ని గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లు, సీఏ లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం

**చిన్నశంకరంపేట, జనవరి 20, ప్రభాతవార్త:**
పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు కృషి చేస్తున్నట్లు మండలపరిధిలోని చందాపూర్ ప్రాథమికపాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. బడితోటలోభాగంగా పాఠశాల ఆవరణలో తోటకూర, మెంతికూర, గంగబాయిలుకూర, పాలకూర వంటి మొక్కలనుపెంచుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవగాహన చేసుకోవాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనసమయంలో నిత్యం పాఠశాల ఆవరణలో పండిన కూరగాయలనే వండి రుచికరమైన భోజనాన్ని పెడుతున్నామన్నారు. ఎలాంటి రసాయనాలు వినియోగంచకుండా పండిస్తున్నట్లు తెలిపారు.

## విద్యార్థులకు టై, బెల్ట్‌ల పంపిణీ

**వెల్దుర్తి, జనవరి 20, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని మన్నెవారి జలాల్‌పూర్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మాజీసర్పంచ్ రంగి కృష్ణ టై, బెల్టులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మండలవిద్యాధికారి యాదగిరి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసహాయం

**చిన్నశంకరంపేట, జనవరి 20, ప్రభాతవార్త:**
చిన్నశంకరంపేట పట్టణానికి చెందిన సౌజన్య, బాలుల కూతురు మానస అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఇటీవల మృతిచెందింది. ఈవిషయం తెలుసుకున్న సౌజన్య 10వతరగతి మిత్రులు బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసహాయంతోపాటు, 50కేజిల బియ్యాన్ని సోమవారం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి నరేష్, మెడి మురళి, నర్సింలు, ఎల్లంలు పాల్గొన్నారు.

## నేటి నుంచి మండలంలో గ్రామ సభలు



ప్రజాపాలన గ్రామసభల నిర్వాహణపై చర్చిస్తున్న ఎంపిడిఓ

**న్యాల్‌కల్, జనవరి 20, ప్రభాతవార్త:**
ఈనెల 21వ తారీఖు నుంచి 24వ తేదీవరకు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ కవలాస్ రాజశేఖర్ అన్నారు. సోమవారం మండలకేంద్రమైన న్యాల్‌కల్ లోని మండలపరిషత్ కార్యాలయంలోని సమావేశమందిరంలో ఆయా శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. గ్రామ సభల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు ఎంపిడిఓ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ భూపాల్, ఎంపిఓ సురేష్, ఏపిఓ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు



బిజెపి సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమంలో బిజెపి నాయకులు

**నర్సాపూర్, జనవరి 20, ప్రభాతవార్త:**
జిల్లాకేంద్రమైన మెదక్‌లోని బిజెపిపార్టీ కార్యాలయంలో సోమవారం బిజెపిపార్టీ అధ్వర్యంలో బిజెపి పార్టీ జిల్లా సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో బిజెపిపార్టీ మెదక్‌జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌తోపాటు నర్సాపూర్ పట్టణానికిచెందిన బిజెపి ఓబీసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరారెడ్డి, వాల్‌దాస్ మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## దేవరయాంజాల్‌లో ఘనంగా ఆలయ పాలకవర్గం స్వీకారం

**శామీర్‌పేట, జనవరి 20, ప్రభాతవార్త**
దేవరయాంజాల్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్‌గా పెండెం లక్ష్మినారాయణ (నాని), ధర్మకర్తలుగా పలువురు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. సోమవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని దేవరయాంజాల్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో పాలకవర్గం ధర్మకర్తల, చైర్మన్ ప్రమాణస్వీకారం కార్యక్రమం ఘనంగ జరిగింది. దేవాదాయ, ధర్మాదాయశాఖ రంగారెడ్డి జిల్లా ఇన్స్‌పెక్టర్ కె.మోహన్‌రెడ్డి చేత ప్రమాణస్వీకారం చేయించారు. దీనికిముందుగా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ పాలకవర్గం (ధర్మకర్తలు) చైర్మన్‌గా పెండెం లక్ష్మినారాయణ(నాని), ధర్మకర్త సభ్యులుగా ఎల్లంకి భారతి, నానిగల్ల హరిగోపాల్, వలందాసు మురళిగౌడ్, గుడిసెని హరికృష్ణ, బీమిడి నీలం సంజీవరెడ్డి. తూంకుంట జగదీశ్, ఎక్స్‌అఫిషియో సభ్యులుగా పూజారి కందాల సీతారామచారిలు ప్రమాణం స్వీకారం చేశారు. ఆలయానికి ఇటీవలనే ధర్మకర్తలను నియమించిన సంగతి తెలిసిం దే. ఈ సందర్భంగ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ దేవరయాంజాల్ శ్రీసీతారమచంద్రస్వామి ఆలయం పూర్వం నిర్మించి ఉండటం, మంచి చరిత్ర కల్గి ఉందని అన్నారు. ఆలయానికి వందలాది ఎకరాల భూమి ఉండి సుమారు 7కోట్ల రూపాయల వరకు నిధి ఉన్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ది కోసం సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి నిధుల మంజూరు కోసం కృషి చేస్తానని ఆయన హామి ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి నూతన పాలకవర్గం నిరంతరం కృషి చేయా లని సూచించారు. ఆలయ నూతన చైర్మన్ పెండెం లక్ష్మినారాయణ మాట్లాడుతూ ఆలయ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన అందరికి దన్యవాదాలు తెలియజేశారు. అందరి సహకారంతో ఆలయ అభివృద్ది కోసం కలిసి పనిచేస్తానని లక్ష్మినారాయణ అన్నారు. దేవాలయ రథశాలను తన స్వంత నిధులతో నిర్మిస్తానని టిపిసిసి సెక్రటరీ పీసరి మహిపాల్‌రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్‌నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, డిసిసి అధ్యక్షులు ఎస్.హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలు యాదవ్, రాష్ట్ర హాజ్‌కమిటీ మెంబర్ ముజీబుద్దీన్, మేడ్చల్ నియోజకవర్గ ఎ.బి బ్లాక్‌ల అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి, పలువురు పార్టీ అధ్యక్షులు వై.ఎస్.గౌడ్, ఎస్.శ్రీనివాస్‌యాదవ్, రమణారెడ్డి, కౌన్సిలర్లు ఎస్.మధుసూదన్‌రెడ్డి, పి.నర్సింగ్‌రావుగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీసర్పంచులు పి.శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌ముదిరాజ్, టి.లావణ్య శంకర్‌గౌడ్, డి.వెంకటేశ, మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం తరుణ్‌గౌడ్, పలువురు నాయకులు పి.మహిపాల్‌రెడ్డి, ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, పి.వీరారెడ్డి, టి.శంకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


మోడల్ హౌజ్‌కు భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

## ఇందిరమ్మ మోడల్ హౌజ్‌కు భూమిపూజ

**హుస్నాబాద్ రూరల్, జనవరి 20, ప్రభాతవార్త:** పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఇందిరమ్మ మోడల్ హౌజ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు మండల స్పెషల్ ఆఫీసర్ ఎ.వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎండిఓ వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందుతోకలిసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతుందని, పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇంటి పథకంలో ఇండ్లు మంజూరైన లబ్దిదారులకు ప్రభుత్వం విడతలవారీగా రూ 5లక్షలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల డిఈ శంకరయ్య, అధికారులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

**అక్కన్నపేట, జనవరి 20, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని తుక్కగూడ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంబలి రాములకు జరిగిన అన్యాయం పట్ల మండలంలోని గౌరవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరసన కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జక్టో ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించడం జరిగిందని రాములకు అన్యాయం చేసిన దుండగులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు జ్యోతి, రామణ్, బాబు, వెంకట నర్సయ్య, శంకర్, చంద్రారెడ్డి, కృష్ణకుమారి, మంజు పాల్గొన్నారు.

## కవి వెంకట్‌కు రాష్ట్ర సంగీత కళా సాహిత్య సన్మానం


అభినందన పత్రం అందుకుంటున్న కవి వెంకట్

**కొమురవెల్లి, జనవరి 20, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ పద్యకవి, వ్యాఖ్యాత, కవి యాత్ర జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ రాష్ట్ర సంగీత, సాంస్కృతిక కళా సాహిత్య అభినందన పత్రం అందుకున్నారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి భారత్ వికాస పరిషత్ వేదికపై సోమవారం జరిగిన కళా సంగమం, సంగీత సాహిత్య సాంస్కృతికోత్సవంలో లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ, నిర్వాహకులు సుమలత, శ్రీ వాగ్దేవి కళాపీఠం వ్యవస్థాపకులు వెంపరాల వెంకటలక్ష్మీ, శ్రీనివాసమూర్తి తదితరులు చేతుల మీదుగా అభినందన పత్రం, సన్మానం అందుకున్నారు. అభినందన పత్రం, సన్మానం అందుకున్న వెంకట్‌ను గ్రామ మాజీ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి చేర్యాల, సిద్దిపేట, గజ్వేల్, కవులు కళాకారులు అభినందించారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు

**ఆదాయం రూ.15,25,194 నగదు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**


వెంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

జిల్లా కేంద్రంలోని మోహినిపురా శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ హుండీని సోమవారం లెక్కించారు. డివిజన్ పర్యవేక్షకులు విజయలక్ష్మీ, ఆలయ వ్యవస్థాపక అనువంశిక ధర్మకర్త, ఆలయ చైర్మన్ తిరునగరివెంకట రమేష్ విష్ణుల ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. 113 ఆలయ హుండీ లెక్కించగా రూ.15,25,194 నగదు రాగా టిజిబి బ్యాంక్‌లో జమ చేశారు. కార్యక్రమంలో వికాస్ తరంగిణి, కోటిలింగాల సేవా సమితి,అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.

## ఆలయ కమిటీ చైర్మన్‌కు సన్మానం

**హత్నూర జనవరి 20, ప్రభాతవార్త :** హత్నూర మండలం షేర్ ఖాన్ పల్లి గ్రామ పరిధిలోని పలుగు మీది నల్ల పోచమ్మ దేవస్థాన ఆలయ కమిటీ చైర్మన్ పి. మల్ల గౌడ్ ను సోమవారం సంగారెడ్డి జిల్లా కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. జ్ఞాపికను అందజేశారు. నూతన చైర్మన్ ఆధ్వర్యంలో దేవస్థానం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం నాయకులు . జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు రామా గౌడ్, రవిగౌడ్ సంగారెడ్డి మండలాధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్ ఉపాధ్యక్షులు కృష్ణగౌడ్, నాయకులు పవన్‌గౌడ్ నారాయణగౌడ్, మల్లేశంగౌడ్, లచ్చగౌడ్, సుదర్శన్ గౌడ్, శేఖర్ గౌడ్, ప్రభువు గౌడ్, మల్లేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


చైర్మన్ ను సన్మానిస్తున్న కల్లు గీత కార్మిక సంఘం నాయకులు

# ప్రశాంతంగా ముగిసిన చిన్న పట్నం, అగ్నిగుండాలు


స్వామి వారి విగ్రహాలను తీసుకవస్తున్న అర్చకులు


చిన్న పట్నం, అగ్నిగుండాలు దాటుతున్న భక్తులు

**కొమురవెల్లి, జనవరి 20, ప్రభాతవార్త :** హైదారాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి ఆలయ వర్గాల సహకారంతో సోమవారం, పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమం అంగరంగవైభవంగా భక్తిశ్రద్దలతో నిర్వహించారు. అగ్నిగుండాల ప్రవేశ కార్యక్రమం అధ్యంతం ఉత్కంఠభరితంగా కొనసాగగా, చిన్న పట్నం చూసిన భక్తులు భక్తిపారవశ్యంతో మునిగిపోయారు. ముందుగా తోట బావివద్ద కట్టెలను వరుసుగా పేర్చి అగ్నిగుండంగా మార్చారు. అర్చకులు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి చిన్న పట్నం, అగ్నిగుండం వరకు తీసుకొచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నపట్నం, అగ్నిగుండాలను అర్చకులు దాటిన వెంటనే భక్తులు పట్నం, అగ్నిగుండాలను దాటారు. అనంతరం భక్తులు ఆలయంలోకి ప్రవేశించి మల్లికార్జునస్వామి, బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలను దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం మేరకు శివసత్తులకు, ఘనాచార్యులకు ఈవో రామాంజనేయులు, కమిటీ సభ్యులు కండువా, జాకెట్ ముక్కలతో పాటు స్వామి వారి బండారిని పంపిణీ చేశారు. శివసత్తు పూనకాలతో భక్తులు అగ్నిగుండాలను దాటుతూ స్వామి వారిని సర్మించుకున్నారు. కార్యక్రమంలో ఎఈవో బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీరాములు, సిబ్బంది విజయ్ భాస్కర్, సభ్యులు, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.

కాగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీపీ డాక్టర్ అనురాధ ఆదేశాల మేరకు ఎఆర్ అడిషనల్ డిసిపి సుభాష్‌చంద్రబోస్, హుస్నాబాద్ ఎసిపి సతీష్ ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణంలో చిన్నపట్నం, అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించిన భక్తులకు, బందోబస్తు నిర్వహించిన పోలీసు అధికారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో చేర్యాల సిఐ శీను, కొమురవెల్లి ఎస్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

## సగర ఉప్పర సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**సంగారెడ్డి మున్సిపాలిటీ జనవరి 20 ప్రభాతవార్త:** సగర ఉప్పర సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సోమవారం ఆవిష్కరించారు. అనంతరం చింత ప్రభాకర్ మాట్లాడుతూ సగర ఉప్పర సంఘానికి నా పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సంఘం మహిళలు, సభ్యులు, ఎమ్మెల్యేను పుష్పగుచ్ఛంతో సత్కారించి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్‌రెడ్డి, సగర ఉప్పర సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మురళీ కృష్ణ, కౌన్సిలర్ రామప్ప, ఉప అధ్యక్షులు రవి, వెంకటయ్య, ఆంజనేయులు, సగర మల్లేశం సగర, గోనే ప్రవీణ్ సగర, శ్రీనివాస్ సగర, పాండు సగర, సాయి కుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## బిసి జాగృతి సేన ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడిగా బండి శేఖర్ ముదిరాజ్


శేఖర్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య, కృష్ణయాదవ్

**హైదరాబాద్, జనవరి 20,ప్రభావార్త:** బిసి జాగృతి సేన ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు రేగోడ్ మండలంగా మర్పల్లి గ్రామానికి చెందిన బండి శేఖర్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్ బిసి భవన్ లో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, బిసి జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ నియమాక పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కమిటీలు వేసి బిసిలలో చైతన్యం నింపాలని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో స్థానాలు సైతం బీసీలు కైవసం చేసుకునేలా కృషి చేయాలని కృష్ణయ్య సూచించారు. బండి శేఖర్ ముదిరాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈబాధ్యతలు అప్పగించిన ఎంపి. ఆర్ కృష్ణయ్య, బిసి జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణయాదవ్‌లకు ధన్యవాదులు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యువతతో కమిటీలు వేసి బీసీల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు గుజ్జకృష్ణ, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బేరి రామచంద్రయ్య యాదవ్, అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### యువతకు మార్గదర్శి వివేకానందుడు

**కొండపాక, జనవరి 20, ప్రభాతవార్త :** యువతకు మార్గదర్శి వివేకానందుడు అని సామాజిక కార్యకర్త సిద్దరెడ్డి అన్నారు. సోమవారం శ్రీసత్య సాయి ప్రశాంతినికేతన్ జూనియర్ కాలేజీలో నెహ్రు యువ కేంద్రం అధ్వర్యంలో వివేకనంద జయంతి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. నేడు యువత మాదకద్రవ్యలకు, డ్రగ్స్‌కు, చెడు వ్యసనాలకు అలవాటుపడి వారి ఉజ్వల భవిష్యత్‌ను పాడు చేసుకుంటున్నారని అయన అవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రోటరీ క్లబ్ జాయింట్ సెక్రటరీ వైద్యనాథ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి చెందాలంటే యువత ప్రధాన పాత్ర పోషించాలని కోరారు. సెల్ పోన్‌లో సమయం వృద్దా చేస్తు యువత పక్కదారి పడుతు చెడు మార్గంలో నడుస్తుందన్నారు. చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి చేరుకునేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంద్రసేన, ఫిలిం డైరెక్టర్ హర్ష, శ్రీనిత, నెహ్రు యువ కేంద్రం కోఆర్డినేటర్ రంజిత్‌రెడ్డి, అకౌంటెంట్ కిరణ్, సునైన, నర్సింహ్మారెడ్డి, అనురాద, ఉపాధ్యయ బృదం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

## హెచ్‌ఎం రాములుపై దాడి చేసినవారిని శిక్షించాలి

**టిఎస్‌జిహెచ్‌ఎంఎ జిల్లా అధ్యక్షుడు రామచంద్రం**

**కొండపాక, జనవరి 20, ప్రభాతవార్త :** ప్రధానోపాధ్యాయుడు కంబాలపల్లి రాములుపై భౌతికదాడులకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిరసన తెలుపుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ సంఘం సిద్దిపేట జిల్లా అసోషియెట్ అధ్యక్షుడు చందు రామచంద్రం సోమవారం తెలిపారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడిపై పాఠశాలలోనే కొంత మంది దుండగులు వచ్చి దాడి చేయడం నేరమన్నారు. ప్రభుత్వం వెంటనే అ దుండగులను చట్టపరంగా శిక్షంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర నాయకులు వంగ నర్సింరెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర శాఖ తరపున ఇట్టి దుశ్చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం బాల కనకయ్య, శ్రీనివాస్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, మల్లారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ అందజేత

**కొండపాక, జనవరి 20, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి మండల పరిధిలోని మెదినిపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు తిరుమల వెంకటరమణ ఆర్థిక సహకరంతో 5 మంది పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లను సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడు వెంకటరమణ సొంత ఖర్చులతో వారి తండ్రి జ్ఞాపకార్థము డ్రెస్‌లు అందించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశం, ఉపాధ్యాయులు వెంకటరమణ, శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

## నేడు జోగిపేటలో నాలుగు వార్డులలో సభలు

**జోగిపేట, జనవరి 20,ప్రభాతవార్త:** అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారంనాడు 1వ వార్డుల జోగినాథస్వామి గుడి వద్ద, 4వ వార్డులో దూద్‌పీర్ మసీదు వద్ద, 10వ వార్డులో ప్రభుమందిరం వద్ద, 15వ వార్డులో రజక సంఘం వద్ద ఉదయం పది గంటలకు ఈ గ్రామసభలు ప్రారంభమౌతాయని ఆయన తెలిపారు. ఇందులో రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.

## గ్రామాల అభివృద్ధికి రేవంత్‌రెడ్డి సర్కారు కృషి

**మిరుదొడ్డి, జనవరి 20, ప్రభాతవార్త :** మండలపరిధిలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సోమవరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మల్లుపల్లిలో రూ.10 లక్షలు, చెప్యాల రూ.10 లక్షలు, అల్వాల రూ.10 లక్షలు చొప్పున ఆయా గ్రామాలలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వారా సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. గ్రామాల అభివృద్ధికి సిఎం రేవంత్‌రెడ్డి సర్కారు నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఆరు గ్యారెంటీలలో భాగంగా ఈనెల 26న రాష్ట్ర సర్కారు మరో 4 కొత్త పథకాలు అమలు చేస్తుందన్నారు. రైతుల, పేదల, మహిళల సంక్షేమమే కాంగ్రెస్ సర్కారు ధ్యేయమన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మద్దెల రాజేశం, ఉపాధ్యక్షులు మహమ్మద్ హర్షద్, మాజీ ఎంపిపి గజ్జల సాయిలు, మహమ్మద్ జహంగీర్, పూదూరి మహేష్, ఎండి.నవాజ్, భూపతిగౌడ్, ఎనగంటి కిష్టయ్య, నీరుటి రాజు, మాసన్‌పల్లి మహేందర్‌రెడ్డి, కన్నరెడ్డి, రత్నారెడ్డి, నాగరాజు, రాములు, కనకయ్య, కనకరాజు, లక్ష్మణ్, యాదగిరి పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

# హత్య కేసు మిస్టరీని ఛేదించిన పోలీసులు

**నిందితుల అరెస్ట్**

**వివరాలు తెలిపిన సిఐ అనిల్‌కుమార్**


వివరాలు తెలుపుతున్న సిఐ అనిల్‌కుమార్

**జోగిపేట, జనవరి 20,ప్రభాతవార్త:** సెల్‌ఫోన్, బైకు కోసం ఓ వ్యక్తిని హత్య చేసిన ఉదంతాన్ని పోలీసులు ఛేధించారు. ఇందుకు సంబంధించి సోమవారం జోగిపేటలోని సర్కిల్ కార్యాలయంలో సిఐ అనిల్‌కుమార్ వివరించారు. గత ఆదివారం తాలెల్మ శివారులో ఓ వ్యక్తి హత్యగావించబడ్డ సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. కాగా మృతుడు మండల పరిధిలోని నాదులాపూర్ గ్రామానికి చెందిన కర్రోల్ల శ్రీనివాస్(26)దిగా గుర్తించారు. అనంతరం ఈ హత్యపై దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు పలుకోణాల్లో దర్యాప్తు జరిపి చివరకు హత్య చేసినవారిని గుర్తించారు. జోగిపేటకు చెందిన సద్దాం హుసేన్, తాడ్‌దాన్‌పల్లికి చెందిన యూనుస్ బావ బావమరుదులు. సద్దాంకు మద్యం తాగే అలవాటు ఉంది. ఈ క్రమంలో మరెల్లి, తాలెల్మ గ్రామాలకు అతడు తరుచూ వెళ్లి మద్యం, కల్లు సేవించేవారు. ఈ క్రమంలో నాదులాపూర్ గ్రామానికి చెందిన కర్రోల్ల శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడింది. గత ఆదివారం సద్దాంహుసేన్, యూనుస్ తాలెల్మలో మద్యం తాగిన సందర్భంలో కర్రోల్ల శ్రీనివాస్ అక్కడికిరాగా, ముగ్గురు కలిసి మద్యం తాగారు. కర్రోల్ల శ్రీనివాస్ ఫోన్‌లో లూడో గేమ్ ఆడుతూ మద్యం తాగాడు. దీంతో ఆ గేమ్‌లో నేనూ బెట్టింగ్ పెడతానని, డబ్బులు వచ్చాక మద్యం తాగించాలని శ్రీనును సద్దాం కోరడంతో అందుకు శ్రీనివాస్ అంగీకరించాడు. అనంతరం ముగ్గురు కలిసి మద్యం తీసుకుని తాలెల్మ శివారులో గుట్ట ప్రాంతంలో చెక్‌డ్యాం వద్ద ఓ మోదుగు చెట్టుకింద కూర్చొని మద్యం తాగారు. ఈ సందర్భంలోనే సద్దాం, యూనుస్‌లు ఇద్దరు కలిసి కర్రోల్ల శ్రీనివాస్ బైకు, సెల్‌ఫోన్‌ను దొంగలించాలనకుని, అప్పటివరకు తాగిన మద్యంబాటిల్ పగులగొట్టి కర్రోల్ల శ్రీనివాస్ గొంతులో పొడిచారు. అనంతరం బండరాళ్లను అతని తలపై మోదడంతో అతను మృతి చెందాడు. అనంతరం వారు ఇండ్లకు వెళ్లిపోయారు. సిసి కెమెరాల ఆధారంగా ఈ హత్యను ఛేదించినట్లు సిఐ అనిల్‌కుమార్ తెలిపారు. వీరిని సోమవారం ఉదయం అదుపులోకి తీసుకొని విచారించగా, హత్య చేసినట్లు అంగీకరించారని సిఐ తెలిపారు. ఈ మేరకు వారిద్దరిని రిమాండుకు పంపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.


ప్రత్యేక అలంకరణలో కొండపోచమ్మ అమ్మవారు, బోనమెత్తిన శివసత్తి

# శిగమెత్తిన కొండపోచమ్మ

**-అలరించిన లష్కర్ బోనాలు..పోతరాజుల ఆట పాట**

**జగదేవ్‌పూర్, జనవరి 20 ప్రభాతవార్త :** శ్రీకొండపోచమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర నలుమూలల నుండి పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించేందుకు తరలివచ్చారు. అమ్మవారి మొక్కులు తీర్చేందుకు కడవలలో బోనాలు తయారుచేసి డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేస్తూ శిగాలు ఊగుతూ అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో ఎక్కడ చూసినా శివసత్తుల పూనకాలతో కొండ పోచమ్మ ఆలయ ప్రాంగణం మొత్తం శిగమూగినట్లు అనిపించింది.

**ప్రత్యేక ఆకర్షణలో హిజ్రాలు**

కొండపోచమ్మ అమ్మవారి ఉత్సవాలలో భాగంగా హిజ్రాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తే వారు కోరిన కోరికలు వెంటనే తీరుతాయనే నమ్మకంతో కొంత మంది భక్తులు హిజ్రాలతో బోనాలను తీపించగా హిజ్రాలు వివిధ వేషధారణలతో చేసిన నృత్యాలతో చూపరులను ఆకర్షింపజేశాయి.

**చిరు వ్యాపారులకు భలే గిరాకీ**

జాతరలో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వ్యాపారస్తులకు మంచి గిరాకీ అవుతుందని పల్లెల్లో నాటుకోళ్లు పెంచుకునే రైతులు జాతరకు తీసుకువచ్చి విక్రయించడంతో హైద్రాబాద్ వాసులు వాటిని ఎంతో ఇష్టంగా కొనుక్కోగా వ్యాపారస్తులు తమకు మంచి గిరాకీ లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. జాతరలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తగిన చర్యలు తీసుకున్నారు.

**అమ్మవారిని దర్శించుకున్న జిల్లా సెషన్ కోర్టు జడ్జి**

జాతరలో భాగంగా తొలిరోజు కొండపోచమ్మ అమ్మవారిని సిద్దిపేట జిల్లా ఒకటవ సెషన్ కోర్టు న్యాయమూర్తి శ్రావణి కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించుకున్నారు. ఆలయ ఈఓ రవికుమార్ మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలు నేటి నుండి మార్చి 31 వరకు పెద్దఎత్తున కొనసాగుతాయని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

## విద్యార్థులకు అన్నదానం

**సిద్దిపేట అర్బన్, జనవరి 20,ప్రభాతవార్త :** జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం వాసవి క్లబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం క్యాస లక్ష్మీబాలయ్య ఆర్థిక సహాయంతో అభయజ్యోతి మానోవికాస కేంద్రంలోని విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అదనపు ప్రధాన కార్యదర్శి మర్యాల వాణి, అధ్యక్షులు మురంశెట్టి కుమార్, చిగుళ్లపల్లి మంజుల, సత్యనారాయణ, ధనలక్ష్మీ, బాలయ్య, రూపా, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు భద్రత మాసోత్సవాలు

**మర్కుక్, జనవరి 20 (ప్రభాతవార్త):** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా మర్కుక్‌లో సోమవారం ఏఎస్ఐ రవీందర్, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో వాహనదారులకు, యువకులకు, ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. త్రిబుల్‌రైడింగ్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, అతివేగంగా వాహనాలు నడపడం, మైనర్ డ్రైవింగ్, మద్యం తాగి డ్రైవ్ చేయడం ప్రమాదకరమని, ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన పత్రాలు, ఇన్సూరెన్స్ కలిగివుండాలని తెలిపారు.


వంతెనపై నుంచి పడి నుజ్జునుజ్జయిన లారీ

# వంతెనపై నుంచి కిందపడిన లారీ

**డ్రైవర్‌కు తీవ్ర గాయాలు**

**జోగిపేట, జనవరి 20,ప్రభాతవార్త:** నాందేడ్-అకోలా జాతీయ రహదారిపై సోమవారం వేకువజామున రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. కర్నూలు జిల్లా బేతంచెరువు నుంచి బండలలోడ్‌తో రాజస్థాన్ వెళ్తున్న లారీ సంగుపేట వద్ద ఉన్న జాతీయ రహదారిపై ఉన్న వంతెనపై నుంచి అదుపుతప్పి కింద పడింది. లారీకి సంబంధించిన టైర్లు మొత్తం బ్రిడ్జిపై ఉండిపోగా, లారీ నుజ్జు నుజ్జయింది. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ షకీర్ సుమారు మూడు గంటలపాటు లారీ కేబిన్ ముందు భాగంలో ఇరుక్కుని పెద్దగా అరుపులు పెట్టాడు. కాగా క్లీనర్ ధర్మేందర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. జోగిపేట ఎస్ఐ పాండు సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన డ్రైవర్, క్లీనర్‌లను మెరుగైన చికిత్సకోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# యథేచ్చగా ఇసుక అక్రమ రవాణా

**పట్టించుకోని అధికారులు**

**బెజ్జంకి, జనవరి 20, ప్రభాతవార్త :** మండలం లోని మోయతుమ్మెద వాగు ఇసుక అక్రమ రవాణాదారులకు కల్పవృక్షంగా మారి కాసుల వర్షం కురిపిస్తుందనడంలో అతిశయోక్తి లేదు. మండల పరిధిలోని తోటపల్లి, గాగిళ్లాపూర్ గ్రామ శివారులో గల వాగునుంచి ఇసుక అక్రమ రవాణాదారులు ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి పగలు అనే తేడ లేకుండా ట్రాకర్లతో అక్రమంగా రవాణా చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ఇంటి, పలు భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్న సమయంలో ఇసుక రవాణాదారులు అనుమతులిచ్చిన ప్రదేశాలకే ఇసుకను రవాణా చేస్తున్నారా లేక పక్కదారి పట్టిస్తున్నారా అని పర్యవేక్షణ చేసే నాథుడు లేడు. ఇష్టారాజ్యంగా పరిమితికి మించి ఇసుకను తోడేస్తున్నా సంబంధిత శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపానపోవడం లేదు. పగటి సమయంలో ఇండ్ల మధ్యలో రెండు మూడు ట్రిప్పుల మేర ఇసుకను నిల్వచేస్తూ రాత్రి సమయాల్లో మినీ టిప్పర్, మ్యాక్స్ పికప్‌వంటి వాహనాలలో ఇసుకను పట్టణాలకు తరలిస్తూ అమ్మి సొమ్ముచేసుకుంటున్నారు.

**అక్రమ రవాణాలో మైనర్లే డ్రైవర్లు**

ఇసుక అక్రమ రవాణా చేసే సమయంలో వాహ నాలను నడుపుతున్న వారిలో సగానికి పైగా లైసెన్స్ అనుభవం లేని డ్రైవర్లే ఉండడం గమనార్హం. కనీస అవగాహన లేకుండా రోడ్లపై ఇష్టం వచ్చిన రీతిలో వాహనాలను నడుపుతూ తోటిప్రయాణీకులకు, బాటసారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. అక్రమ ఇసుకను తరలించే సమయంలో ట్రాక్టర్‌న్ నడిపే మైనర్లు ఓ చేతిలో ఫోన్ మాట్లాడం మరో చేతిలో స్టీరింగ్ పట్టుకొని అతివేగంగా వెళ్తుండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులతో పాటు పోలీసులు సిబ్బంది మైనర్ డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఇసుక ట్రాక్టర్ నడుపుతున్న మైనర్ బాలుడు

## మాజీమంత్రిని కలిసిన కార్పొరేటర్



మాజీమంత్రి హరీష్‌రావును కలిసిన కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, జనవరి 20, ప్రభాతవార్త:**
మాజీమంత్రి, సిద్ధిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును సోమవారం భారతీనగర్ కార్పొరేటర్ వెన్నవరం సింధూ, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలుసుకుని పూలబొకేను అందించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ స్థితిగతులను మాజీమంత్రి హరీష్‌రావు కార్పొరేటర్ దంపతులను అడిగి తెలుసుకున్నారు.

## హెచ్‌ఎంపై దాడి చేసిన దుండగులను శిక్షించాలి



నల్లబ్యాడ్జీల ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

**కంది, జనవరి 20, ప్రభాతవార్త:**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు కంబాలపల్లి రాములుపై దాడిచేసిన దుండగులను వెంటనే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. సోమవారం మండలపరిధిలోని చేర్యాల జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయసంఘాల పిలుపుమేరకు ఆయాపాఠశాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయసంఘాల నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమేశేఖర్, పిఆర్‌టియు మండల అధ్యక్షులు కె.రాజు, ఉపాధ్యాయులు యాదగిరి, మీనాక్షి, జనార్ధన్, సంగమేశ్వర్, కవిత, భవాని, శ్రీలక్ష్మి, నాగేందర్, శోభ, విజయలక్ష్మి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

**మెదక్ రూరల్, జనవరి 20 ప్రభాతవార్త:**
జిల్లాపోలీస్ ప్రధానకార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిద్యాదిదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్ట ప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్‌ల యొక్క ఎస్ఐ, సీఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని వివరించారు.

## గ్రామస్థాయిలో బిజెపి పటిష్టతకు కృషిచేయాలి



ఈటెల రాజేందర్‌ను శాలువాతోసన్మానిస్తున్న మండల బిజెపి అధ్యక్షుడు కోణం విఠల్ తదితరులుల

**పెద్దశంకరంపేట, జనవరి 20, ప్రభాతవార్త:**
రానున్న స్థానికసంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాలలో భారతీయ జనతా పార్టీ పటిష్టత కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పెద్ద శంకరంపేట మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్, నారాయణఖేడ్ నియోజకవర్గ బీజేపీ నాయకులు పత్రి రామకృష్ణ, సంజీవరెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ వారితో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో బూత్ స్థాయి వరకు భారతీయ జనతా పార్టీని పటిష్ట పరచాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాలలో బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యధిక స్థానాలను గెలుపొందేలా కృషి చేయాలి అన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామాలలో ప్రజలందరికీ వివరించాలని పిలుపునిచ్చారు.

## ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

**అల్లాదుర్గం, జనవరి 20, ప్రభాతవార్త:**
అధికారంలోకి వస్తే 6గ్యారంటీలను అమలు చేస్తామని ప్రజలను నమ్మించి గద్దెనెక్కిన కాంగ్రెస్‌పార్టీ చేసినహామీలను అమలుచేయడంలో ప్రజలను మోసం చేస్తోందని అందోల్ బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ విచారం వ్యక్తంచేశారు. సోమవారం మండలకేంద్రమైన అల్లాదుర్గంలో రైతుకు వెన్నుపోటు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, జైపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా చేసిన హామీలను అమలు చేయకుండా గమ్మున కూర్చొంటే బిఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని క్రాంతి కిరణ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో చాపల వెంకటేశం, పల్లెగడ్డ నర్సింలు, అంజియాదవ్, బేతయ్య, రామగౌడ్, బత్తుల వీరన్న, నవీన్‌రెడ్డి, నర్సింలు, కృష్ణారెడ్డి, లతీఫ్, రైతులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలి

-జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 20 ప్రభాతవార్త:**
ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన సమస్యలకు అధికారులు కృషి చేసి అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కారం చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 102 దరఖాస్తులు రాగా వాటిలో ధరణి-38, ఇందిరమ్మ ఇళ్లు -11, రుణమాఫీ-03, రేషన్ కార్డులు-10, ఇతర సమస్యలు-40 సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్‌వో భుజంగరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీవో పీడీ శ్రీనివాసరావు సంబంధిత ఇతర శాఖల అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ స్వీకరించారు. ప్రజల నుండి అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించుటకు సంబంధిత శాఖలకు ఎండార్స్ చేసి సిఫారసు చేశారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యత ఇస్తూ వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను అదనపుకలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని అదనపుకలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

-నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఆసుపత్రిలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**పెద్దశంకరంపేట, జనవరి 20, ప్రభాతవార్త:**
విద్య, వైద్యం ప్రజలకు అత్యవసరమైనందున కాంగ్రెస్‌ప్రభుత్వం ఈరంగాలకు పెద్దపీట వేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. సోమవారం మండలపరిధిలోని బుజరాన్ పల్లిలో 8లక్షల రూపాయల ఉపాధిహామీ నిధులతో సిసిరోడ్డు పనులకు శంకుస్థాపన, ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నూతన అంబులెన్స్‌ను ప్రారంభించడంతోపాటు ఉత్తులూరులో 36లక్షల నిధులతో పాఠశాల ప్రహరీగోడ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీచేసి పలు రికార్డులను పరిశీలించారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులకు సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ ఆసుపత్రులలో ఆధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను మొత్తం భ్రష్టు పట్టించిందని విమర్శించారు. కాంగ్రెస్‌ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించడంతో పాటు విద్యార్థుల కోసం మౌలిక సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. అన్ని రంగాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో తాహశీల్దార్ గ్రేసీబాయ్, ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా, మండల విద్యాధికారి వెంకటేశం, మెదక్ జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అవుసుల భవాని, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాయిని మధు, నాయకులు నారా గౌడ్, దాచ సంగమేశ్వర్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, గంగారెడ్డి, హరికిషన్, కుంట్ల రాములు, విఠల్, అనంతరావు, అంజిరెడ్డి, భాను గౌడ్, ఆయా గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి

-హెచ్‌ఎం రాములుపై దాడికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలి
-ఉపాధ్యాయ సంఘాల డిమాండ్



జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో నల్లబ్యాడ్జిలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

**నారాయణఖేడ్, జనవరి 20, ప్రభాతవార్త:**
ప్రభుత్వపాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై జరుగుతున్న ఆరాచకశక్తుల దాడులను ఆరికట్టాలని ఉపాధ్యాయ సంఘాల పిలుపుమేరకు నారాయణఖేడ్ జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన నిరసన కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు హన్మయ్య, యుటిఎఫ్ రాష్ట్రకార్యదర్శి వై.జ్ఞానమంజరి తదితరులు మాట్లడుతూ రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరంమండలం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల తుక్కుటూడ పాఠశాల హెచ్‌ఎం కె.రాములుపై కొందరు దాడిచేశారు. గతనెల 21వ తేదీన సాయంత్రం ఆవరణలో ఎనిమిదవతరగతి విద్యార్థులకు ప్రత్యేకక్లాసులు నిర్వహిస్తుండగా పొరపాటున అయ్యప్పస్వామి మాలవేసుకున్న విద్యార్థికి కాలు తగిలిందనే కారణంతో అదేనెల 23వ తేది ఉదయం 11గంటల సమయంలో పాఠశాలతో ఏ మాత్రం సంబంధంలేని భక్తుల ముసుగులో ఉన్న కొందరు సుమారుగా యాభైమంది స్కూల్‌లోకి చొరబడి హెచ్‌ఎం రాములుపై దాడిచేశారన్నారు. కార్యాలయంలో ఉన్న ఫర్నిచర్‌ను కూడా ధ్వంసం చేశారని పేర్కొన్నారు. హెచ్.ఎం.రాములు తనకు జరిగిన విషయాన్ని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుచేసి దాదాపు నెలరోజులు కావస్తున్నా, ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పోలీసులు కూడా దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోలేదని వారన్నారు. పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై ఆరాచకశక్తుల దాడులను ఆరికట్టడానికి రాష్ట్రప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ, సంఘాలనాయకులు హెచ్చరించారు. ఈనిరసన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.యాదవరెడ్డి, ఆలివేలు, శశికళ, అనురాధ, భాగ్యమ్మ, పుల్లబాయి, శ్రీకాంత్, అశ్రమహమ్మది, సమీన్ బేగం, అర్శ్యనౌసిన్, దత్తురెడ్డి, అనురాధ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## స్థానికసంస్థ ఎన్నికల్లో కురుమలు సత్తాచాటాలి



మాట్లాడుతున్న బిసిసంక్షేమసంఘం ఉమ్మడిజిల్లా అధ్యక్షులు తోంట అంజయ్య

**నారాయణఖేడ్, జనవరి 20 ప్రభాతవార్త:**
రాబోయే స్థానికసంస్థల జడ్పీటిసి, ఎంపిటిసి, సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో కుర్మలసత్తా చాటాలని బిసిసంక్షేమ సంఘం ఉమ్మడిమెదక్ జిల్లా అధ్యక్షులు కరికే సత్యనారాయణ, ఆర్‌సిపురం మాజీ కార్పొరేటర్ తోంట అంజయ్య అన్నారు. సోమవారం నారాయణఖేడ్ పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో తెలంగాణరాష్ట్ర గొర్రెల, మేకలపెంపకందారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాపు మల్‌శెట్టి అధ్యక్షతన నారాయణఖేడ్ నియోజకవర్గంస్థాయి కురుమసంఘం నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన కరికే సత్యనారాయణ, ఆర్‌సీపురం మాజీ కార్పొరేటర్ తోంట అంజయ్యలు మాట్లాడుతూ కురుమకులానికి అండుబాటులో ఉండి కులసేవ చేసేవారికి కొత్తగా జిల్లా కార్యవర్గం ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. స్థానికసంస్థల్లో కురుమలు ఆర్థికంగా రాజకీయంగా సమాజంలో ఎదగాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.కిష్టయ్యమాస్టర్, జిల్లా ఉపాధ్యక్షులు గోవింద్, తిమ్మాపూర్ కుర్మసంఘం జిల్లాకార్యదర్శి డాక్టరు ప్రసాద్, నారాయణఖేడ్ నియోజకవర్గం అధ్యక్షులు ఓంప్రకాష్, కురుమసంఘం నారాయణఖేడ్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు బీరుగొండ, మనూరుమండల మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షులు రాములు, వివిధమండలాల కురుమసంఘం అధ్యక్షులు నారాయణఖేడ్ మండల అధ్యక్షులు రవి, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ప్రజాపాలన గ్రామసభలు

**జహీరాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:**
ఈ నెల 21వ తారీఖు నుంచి 24వ తేదీ వరకు జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోని ఆయాగ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒలు మహేందర్‌రెడ్డి, డి.మహేష్‌లు వేరువేరు ప్రకటనల్లో తెలిపారు. సంక్షేమపథకాల కొరకు అర్హులైనవారు గ్రామసభల్లో దరఖాస్తులు అందచేయాలని వారు సూచించారు.

## సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్‌కు ఘనసన్మానం



సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న క్రీడాకారులు

**గుమ్మడిదల, జనవరి 20, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన గుమ్మడిదలలో వాలీబాల్, కబడ్డీ క్రీడాకారులు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రముఖులు, యువకులు, క్రీడాభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈసందర్భంగా క్రీడాకారులు మాట్లాడుతూ కరోనా మహమ్మారి కారణంగా గతంలో క్రీడలనుంచి విరామం తీసుకోవలసి వచ్చిందని, ప్రస్తుతం క్రీడాకార్యక్రమాలు తిరిగి ప్రారంభమవుతున్నాయని, ఇది సంతోషకర పరిణామం అన్నారు. సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి క్రీడల పట్ల, క్రీడాలకారులపై మమకారంతో ఆర్థికంగా సహకరించి బ్రహ్మాండంగా క్రీడాపోటీలు నిర్వహించినందుకు, క్రీడాకారుల ప్రోత్సాహం కోసం ఆయన చూపించిన శ్రద్ధను వారు ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈకార్యక్రమం గ్రామ క్రీడావాతావరణాన్ని మరింత ఉత్తేజపరిచేలా దోహదపడిందని క్రీడాకారులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎల్క కృష్ణ, చిమ్ముల దేవేందర్‌రెడ్డి, అమ్మగారి ప్రవీణ్‌రెడ్డి, సూర్యనారాయణ, ఆకుల సత్యనారాయణ, కాలకంటి బాల్‌రెడ్డి, కాలకంటి రవీందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైల క్షేత్రానికి 23వ పాదయాత్ర

**ఝరాసంగం, జనవరి 20, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన ఝరాసంగంనుంచి ఆంధ్రప్రదేశ్‌లోని పుణ్యక్షేత్రమైన భ్రమరాంబసమేత శ్రీమల్లికార్జునస్వామి ఆలయానికి సోమవారం పాదయాత్రగా బయలుదేరారు. ఝరాసంగంలోని పార్వతీదేవిసమేత శ్రీకేతకి సంగమేశ్వర స్వామి ఆలయంలో ధనసిరి పీఠాధిపతి వీరేశ్వర శివాచార్యులు స్వామిజీ ప్రవచనాల అనంతరం భక్తులు పాదయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు హనుమంతరావుపాటిల్, మాజీసర్పంచ్ బొగ్గుల జగదీశ్వర్, ఆలయ ప్రధాన అర్చకులు బసయ్యస్వామి, శివశంకర్ పాటిల్, పరమేష్‌పాటిల్, ఎంపి శ్రీనివాస్, వీరు సజ్జనర్, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మహారాష్ట్ర ఔరాద్‌కుచెందిన భక్తులు సోమవారం శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయానికి కాలినడకన చేరుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడలలో మంచినీటి కనెక్షన్‌లు ఇవ్వండి



వాటర్ బోర్డు ఏఈ ప్రవీణ్ కుమార్‌తో మాట్లాడుతున్న బిజెపి మండల అధ్యక్షులు రాజు

**అమీన్‌పూర్, జనవరి 20, ప్రభాతవార్త:**
అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట, పటేల్ గూడలోని ప్రతి కాలనీకు మంచినీటి కనెక్షన్లు ఏర్పాటు చేసి మిషన్ భగీరథ ద్వారా త్రాగు నీటి సదుపాయం కల్పించాలని అమీన్‌పూర్ బీజేపీ మండల అధ్యక్షుడు ఈర్ల రాజు బీరంగూడ వాటర్ బోర్డు ఏఈ ప్రవీణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కాలనీలలో జియో ట్యాగ్ చేసిన ఇండ్లకు త్వరగా త్రాగునీటి కనెక్షన్‌లు ఇవ్వాలని, అలాగే జియో ట్యాగ్ చేయని ఇండ్లకు, అపార్ట్‌మెంట్‌లకు జియోట్యాగ్ చేయాలని కోరారు. దీనికిగాను వాటర్‌బోర్డు ఏఈ ప్రవీణ్‌కుమార్ సానుకూలంగా స్పందించి జనవరి 24వ తేదీన పటేల్‌గూడా రిజర్వాయర్ ఓపెన్ చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా అతిత్వరలో కిష్టారెడ్డిపేట, ద్వారకానగర్, బృందావనంకాలనీ, మోహన్‌వల్లి, వివిధ కాలనీలకు, అపార్ట్‌మెంట్‌లకు మంచినీటిసరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని మిగతా కాలనీలకు దశలవారీగా జియో ట్యాగ్‌చేసి అతితొందరలో మంచినీటిసరఫరా చేయడం జరుగుతుందని ఏఈ ప్రవీణ్‌కుమార్ హామీ ఇవ్వడం జరిగిందని ఈర్ల రాజు చెప్పుకొచ్చారు. ఈకార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీకాంత్, మండల బీజేపీ కోశాధికారి రాకేష్, మోహన్‌వల్లి కాలనీ సొసైటీ అధ్యక్షుడు రాజేందర్ గౌడ్, బృందావనం కాలనీ నాయకులు సత్యం, బబీజేపీ బూత్ అధ్యక్షులు కుమార్ గౌడ్, రాంకిషన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్దిదారుల వివరాలు పకడ్బందీగా నమోదు



విలేజ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

**గుమ్మడిదల, జనవరి 20, ప్రభాతవార్త:**
గుమ్మడిదలమండలం అనంతారంగ్రామంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం గ్రామం మొత్తం పర్యటించి రైతు భరోసా, రేషన్‌కార్డు లబ్దిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేజ్ మ్యాప్ ఆధారంగా ప్రతి పొజిషన్‌లోకివెళ్లి పకడ్బందీగా వివరాలను సేకరించడం జరుగుతుందని, అలాగే రేషన్‌కార్డులు వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఏఈవో ప్రవీణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపోటములు సహజం



క్రికెట్‌టోర్నీ విజేతజట్టుకు కప్పును అందచేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నాగల్‌గిద్ద, జనవరి 20, ప్రభాతవార్త:**
క్రీడల్లో గెలుపు ఓటములు సహజమే అని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కరస్‌గుత్తిలో గత వారం రోజులుగా కొనసాగిన క్రికెట్ టౌర్నమెంట్‌లో విజేతగా నిలిచిన కరస్‌గుత్తి వీరహనుమాన్ టీంకు ఎమ్మెల్యే కప్పుతో పాటు 21వేల రూపాయల నగదును అందచేసి అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుండేరావు పాటిల్, సొసైటీ చైర్మన్ శ్రీకాంత్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సచిన్ పాటిల్, న్యాయవాది సంగన్న, గంగారెడ్డి, అనిల్‌పాటిల్, నారాయణజాదవ్, శోపన్‌రావు పాల్గొన్నారు.

## హెచ్‌ఎంపై దాడి చేసిన దుండగులను శిక్షించాలి

-నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయుల నిరసన




నల్లబ్యాడ్జీలతో పాపన్నపేటలో నిరసన వ్యక్తంచేస్తున్న ఉపాధ్యాయులు

**పాపన్నపేట, జనవరి 20, ప్రభాతవార్త:**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు కంబాలపల్లి రాములుపై దాడిచేసిన దుండగులను వెంటనే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రమైన పాపన్నపేటలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయసంఘాలు పిలుపుమేరకు ఆయా పాఠశాలల్లో విధులునిర్వహిస్తున్న ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహే శ్వర్, పిఆర్‌టియు నాయకులు ప్రవీణ్, నింగన్న, ఉపాధ్యాయులు వేణు గోపాల్‌రెడ్డి, రియాజ్, మంగ నర్సింలు, మోహన్‌రెడ్డి, చంద్రమోహన్, రమేష్, రవికాంత్, శ్రీహరి, శ్రవణ్‌కుమార్, విశ్వనాథ్, పద్మ, మునావత్ రజిత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ ఎటిఎం

**నారాయణఖేడ్, జనవరి 20, ప్రభాతవార్త:**
నేడు డయల్ యువర్ ఎటిఎం (టిజిఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇస్సాక్‌బిన్ మహమ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఇస్సాక్‌బిన్ మహమ్మద్ మాట్లాడుతూ ఉమ్మడిమెదక్ జిల్లాలోని ప్రజలు కార్గో వినియోగదారులు ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు ఫోన్లో సంప్రతించి తమ సమస్యలను తెలుసుకోవచ్చన్నారు. ఫోన్‌నెం. 8125456978కు సంప్రతించి ఈ అవకాశాన్ని కార్గో వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.